# బాబోయ్! ఇవేం పేర్లు?

-కేసరి యాదగిరిరావు

ఆ రోజు 'సీతా నాయుడు' స్టూడియో హడావిడిగా ఉంది. ఎటు చూసినా సినీ రిపోర్టర్లు, 'ఏనాడో' టి.వీ., 'భామినీ'టీ.వీ కెమెరా ఆపరేటర్లతో ఆ ప్రదేశమంతా కోలాహాలంగా సందడి సందడిగా ఉంది.

సినీ చరిత్రలో ఇదివరకు ఎప్పుడూ జరగని అపూర్వ సమావేశమే ఆ సందడికి కారణం.





హైదరాబాద్‌లో గత కొన్ని రోజులుగా జరుగుతోన్న వివిధ సినిమా షూటింగ్‌ల తాలూకు దర్శకులూ, నిర్మాతలూ, కథారచయితలూ, సంగీత దర్శకులూ, నటులూ అందరూ ఒకేచోట సమావేశమై తమ సినిమాలోని కథాంశాలూ, అనుభవాలూ, అనుభూతులను అందరికీ తెలియ జేయాలనే తాపత్రయంతో జరుగుతోన్న సమావేశానికి తానే కథారచయితగా, పాటల రచయితగా, నిర్మాతగా, దర్శకునిగా తలపండిన ఒక ప్రముఖ దర్శకుడు



అధ్యక్షత వహించారు.

కెమెరాల క్లిక్‌లూ, కరచలనాలూ, (కృత్రిమ) నవ్వులూ, మొహమాటలూ.

ఇంతలో సమావేశం ప్రారంభమవుతోన్నట్లు మైకులో ప్రకటన ..... కరతాళ ధ్వనులూ.

సమావేశ ఉద్దేశ్యాన్ని సభాధ్యక్షుడు వివరించి, నిర్మాణం, డబ్బింగ్‌లో ఉన్న తమ చిత్రాల విశేషాలను తెలుపాల్సిందిగా నిర్వాహకులు ఆయా చిత్రాల తాలూకు ప్రముఖ వ్యక్తులను కోరారు.

"నాన్నా, డాడీని చూడాలని ఉంది" సినీ నిర్మాత ప్రసంగిస్తూ, తమ చిత్రంలో తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామిని ఒక అబ్బాయి "తండ్రి"గా భావిస్తూ రోజూ "నాన్న" అని పిలుస్తాడనీ, విధి వైపరీత్యం వల్ల చిన్నవాడే తన తల్లిని విడిచివెళ్ళిన తండ్రిని చూడాలని కోరుకుంటాడనీ, ఆ భగవంతుడు అబ్బాయి తండ్రిని ఎలా కలుపుతాడో వైవిధ్యంగా క్లైమాక్స్‌లో చూపించామనీ, చిత్రంలో కామెడీ బాగా పండిందనీ, ఈ చిత్రాన్ని ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం ఉందనీ అన్నారు.

"నాన్నా! అమ్మ కావాలి!" చిత్ర సమర్పకులు ప్రసంగిస్తూ, ఒక చిన్న సంఘటన కారణంగా అలిగి వేరైనా, తన తల్లి కోసం, ఒక బాలిక పడే మానసిక సంఘర్షణను, వైవిధ్యంతో కూడిన ట్రీట్‌మెంట్‌తో తమ టెక్నీషియన్‌ల సహకారంతో బాగా పండించామని అన్నారు.

"అదిరింది శిష్యా!", "అదిరింది మామా!" దర్శకులు ప్రసంగిస్తూ, ఒక్కొక్కరికి ఒక్కొక్క విధంగా "అదురుడు ఉంటుందనీ, అది ఏ తరహా అదురుడైనా కావచ్చుననీ, తమ సినిమాలను చూసిన ప్రేక్షకులు అదిరిపోవడం ఖాయమనీ అన్నారు.

"నాన్నాయనో, నోరి మామో, ఓ మొగుడో" చిత్ర కథారచయిత ప్రసంగిస్తూ ఈ సినిమా కథ ప్రధానంగా తండ్రి, మామ, భర్తల చుట్టూ తిరుగుతుందనీ, వీరి మనస్తత్వాల మధ్య ఆ ఇంటి కోడలు ఎలా వ్యధకు గురై.... ఉపాయంతో తన కుటుంబీకుల్లో ఏ విధమైన పరివర్తన తెచ్చిందో, కోడలు ఉపాయానికి (?)ప్రేక్షకులు హర్షధ్వానాలు చేయడం ఖాయమనీ అన్నారు.

"పట్టణంలో తమ్ముడు" నిర్మాత మాట్లాడుతూ, పల్లెల్లో ఇంకా సమాజంలో సమసిపోని బూర్జువా విధానాలను వ్యతిరేకించిన ఒక తమ్ముడు పట్టణంలోకి ప్రవేశించి ఎన్నో నేర్చుకొని పల్లెలోని ప్రజల్లో నెలకొని ఉన్న బూర్జువాలలో ఎలా పరివర్తన గావించాడో తమ సందేశాత్మక చిత్రం తెలుపుతుందనీ అన్నారు.

"శ్రీమతి అంటే మా ఆవిడే!" చిత్ర దర్శకుడు మాట్లాడుతూ, భార్యా భర్తల అనుబంధం ఎంతో గొప్పదనీ, ఒక మంచి భార్య కథ ఒక ప్రక్క, అనుమానాలతో, ఆవేశంతో, దురాశతో సంసారాన్ని నాశనం చేసుకునే మరొక భార్య కథ ఇంకో ప్రక్క సమాంతరంగా చూపిస్తూ అత్యంత సహజంగా చిత్రీకరిస్తున్న తమ చిత్రం నూటికి నూరు పాళ్ళూ మహిళా చిత్రమనీ అన్నారు. ఈ చిత్రంలో ఇద్దరు హీరోయిన్‌లు ఉన్నారనీ, ఈ చిత్రంలో నటించే హీరో బ్లాంక్ చెక్, అని ప్రశంసిస్తూ, తమ చిత్రం క్లిక్ కావడం ఖాయమని అన్నారు.

"గిలక్కొట్టుడు" చిత్ర నిర్మాత ప్రసంగిస్తూ, తమ చిత్రానికి నేటివిటీకి తగ్గట్టుగా పాటలను విదేశాల్లో చిత్రీకరించామనీ, లక్షల రూపాయలు సెట్ నిర్మాణం కోసం ఖర్చు చేశామనీ, అందుచేత తమ చిత్రం ప్రేక్షకుల పాకెట్ కొల్లకొట్టడం ఖాయమనీ అన్నారు.

"అయ్యో దొంగలు" చిత్ర దర్శకులు ప్రసంగిస్తూ, సమాజాన్ని రక్షించాల్సిన పోలీసులే, అవినీతికి పాల్పడి దొంగలైతే ఈ వ్యవస్థ ఏ విధంగా తయారవుతుందో వాస్తవికతకు దర్పణం పట్టేలా తమ చిత్రాన్ని చిత్రీకరించామనీ, సందేశాత్మకమైన ఈ చిత్రం ఒక ప్రయోగాత్మక చిత్రం కాగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

"బావా బాగున్నావా?" చిత్ర కథారచయిత మాట్లాడుతూ, తాము ఈ బ్యానర్‌కు రాసిన ఎన్నో కథలు సక్సెస్ అయ్యాయనీ, ఫ్లాప్ అయినవి కొద్ది చిత్రాలు మాత్రమేననీ, వెరైటీ గల ఈ చిత్రంలో మరదలు-బావల మధ్య ప్రణయగాథ, సంసార పక్షంగా చిత్రీకరించడం జరిగిందనీ, పాటలను ఆగ్రా, ఢిల్లీలో చిత్రీకరిస్తున్నారనీ అన్నారు.

"సుపుత్ర ప్రాప్తిరస్తు" చిత్ర దర్శకులు మాట్లాడుతూ, తాను ప్రముఖుల చిత్రాలు చూసి, చూసి దర్శకత్వం నేర్చుకున్నాననీ అన్నారు. "కళ్యాణం కోసం, ఆ పిదప సంతానం కోసం మగువ" తన జీవితంలో కోరుకుంటుందనీ, సంతానం లేని జీవితంలో మాధుర్యం లేదనీ, కథ ఎన్నో మలుపులు తిరిగిన పిదప ఆ తల్లి "టెస్ట్ ట్యూబ్" బేబీని కనడంతో కథ సుఖాంతం అవుతుందనీ అన్నారు. వైజ్ఞానికంగా ప్రేక్షకులలో ఈ చిత్రం చైతన్యం కలిగించడమే కాక, నవ రసాల "మసాలా" ఈ చిత్రంలో దట్టించడంతో ఈ చిత్రం విజయవంతమైన నూర్రోజుల చిత్రం కాగలదనీ చెప్పారు.

- "ఓసే. మనబ్బాయే!" చిత్ర దర్శకులు సూర్యమొగిలి మాట్లాడుతూ, ఇద్దరు అబ్బాయిలు ఒక అమ్మాయిని ప్రేమిస్తారని, వారి మధ్య అబ్బాయిల తండ్రి నలిగి పోతాడనీ, ఆ తండ్రి పాత్రను ఒక సీనియర్ నటుడు పోషిస్తున్నారని అన్నారు. బ్యానర్, దర్శకుల మీద నమ్మకంతో, కథ కూడా వినకుండానే ఈ చిత్రం అంగీకరించాననీ, రొటీన్ క్యారెక్టర్ కాకుండా ఈ చిత్రంలో తన పాత్ర విభిన్నంగా ఉంటుందనీ అందుచేత ఈ చిత్రం విజయవంతం కావడం ఖాయమనీ ఆ సీనియర్ నటుడు నొక్కి వక్కాణించారు.

"మామా నీ బిడ్డ జాగ్రత్త!", "ముంబాయి ప్రియురాలు", "అమ్మాయిగారి విడాకులు", "ఎర్ర పూవులు", "ఒరే యాద్గిరీ", చిత్రాల దర్శకులు తాము డైరెక్ట్ చేస్తోన్న చిత్రాల కథా సారాంశాలనూ, విశేషాలనూ తెలిపారు.

కేసరి యాదగిరిరావు.
లెక్చరర్ ఇన్ కెమిస్ట్రీ.
హుజూరాబాద్, కరీంనగర్




ప్రతిమాభాస్కర్ భీమా ది. యన్.యస్.యఫ్.సి. స్టోర్స్, యల్.పి.జి. వింగ్, శక్కర్‌నగర్, బోధన్,